వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ సంవత్సరం 11 రోజుల పాటు ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. శనివారం ఆమేరకు తమ శాఖ నుంచి ఆదేశాలు అందాయని, వాటిని అమలు చేస్తామన్నారు. ఆయా మండపాలు రిజిస్ట్రేషన్ చేసుకోవటం, పోలీసు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు 11 రోజులు నమోదు చేసుకున్న అన్ని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా వర్తిస్తుందని వారు తెలిపారు.

దేవాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో రోజు విడిచి రోజు రోడ్లను శుభ్రపరిచే వారిని ప్రస్తుతం నెల రోజులుగా పారిశుద్ధ్య పనులను నిర్వహించడం లేదని వెల్లడిస్తున్నారు. దీంతో రోడ్లపై చెత్తాచెదారాలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించాలని కోరుతున్నారు.

స్ఫూర్తిప్రదాత సురవరం



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

శంషాబాద్: అనారోగ్యంతో మరణించిన కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, సురవరం సుధాకర్‌రెడ్డికి ఆ పార్టీ నేతలు అశ్రునయనాలతో నివాళులర్పించారు. శంషాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాసేవలో మమేకమైన ఆయన జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమన్నారు. ప్రజాపోరాటాలను చేసిన విప్లవయోధుడు మృతి పార్టీకి.. బడుగు, బలహీన వర్గాలు, పేదలకు తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, నాయకులు నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, రామస్వామి, యాదయ్య, రామకృష్ణ, ప్రభులింగం, ఆర్.యాదగిరి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఎస్సీ బాలుర, బాలికలు, బీసీ బాలికల సంక్షేమ హాస్టళ్లలో శనివారం పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని హాస్టళ్లలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో పాటు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై అధికారులు అసహనం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ సూర్యానారాయణ, డీఎస్పీ ఎ.రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, రమణ, కృష్ణ, మోహినుద్దీన్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. వసతి గృహాలలో మరుగుదొడ్లు శుభ్రంగా లేవని వారి పరిశీలనలో తేలింది. బాత్‌రూమ్ డోర్లు సరిగ్గా లేవని గుర్తించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో 430 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సూర్యానారాయణ మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లా పరిధిలోని 10 సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. త్వరలో జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సరిగ్గా అందుతున్నాయా లేదా అనే పరిశీలించడానికి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్వాన్ నియోజవర్గంలో వేలాది కుటుంబాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందారన్నారు.

పచ్చదనాల హరివిల్లు

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం





ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిసరాలు పచ్చని చెట్లతో పరిఢవిల్లుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు వర్సిటీ సందర్శకుల హృదయాలను దోచుకుంటున్నాయి. ప్రధాన ద్వారం మొదలుకొని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, పరిపాలన భవనం, ఆడిటోరియం, క్రీడాప్రాంగణం, హాస్టల్ పరిసరాలన్నీ పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. ఆహ్లాదకర వాతావరణం.. పరిసరాల నడుమ ఉభయ సంధ్య వేళల్లో వాకర్లు ఎంతో ఉత్సాహంగా వాకింగ్ చేస్తున్నారు. పరిసరాలు నయనానందకరంగా ఉండటంతో విద్యార్థులు, వాహనదారులు, సందర్శకులకు ఫొటోషూట్‌గా మారింది. విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో చెట్లు చిగురించి పచ్చదనం పరుచుకుంది. – ఏజీవర్సిటీ

కనువిందు చేస్తున్న పచ్చని చెట్లు, రంగురంగుల పూలు | ఫొటో షూట్‌ను మరిపిస్తున్న వర్సిటీ పరిసరాలు







గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- పటిష్ట ఏర్పాటు చేయాలి
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర
- వివిధ అంశాలపై అధికారులతో చర్చించిన కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ బి.శరత్‌చంద్ర సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, విద్యుత్, దేవాదాయ, రెవెన్యూ, పోలీసు, ట్రాఫిక్ పోలీసులు, నీటిపారుదల శాఖ అధికారులతో గణేశ్ నవరాత్రుల ఏర్పాట్లు, నిర్వహణపై సమీక్షించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు, కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. మున్సిపల్ అధికారులతో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్లు, రీవెరిఫికేషన్ నూతన రేషన్ కార్డుల ఎంక్వైరీ, తుపానుల అత్యవసర బృందం (మాన్‌సూన్ ఎమార్జెన్సీ టీమ్) కార్యాచరణ ప్రణాళిక వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధ్రువీకరణ ప్రతాల జారీ, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, వాణిజ్య ప్రకటనల పన్నుల వసూలు, కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జియో ట్యాగ్గింగ్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, అన్–అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టడం, వీధి దీపాల నిర్వహణ, వన మహోత్సవంలో టార్గెట్ ప్రకారం మొక్కలు నాటడం, సంరక్షించడంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై పేరుకుపోయిన ఇసుక తొలగింపు



రోడ్లపై ఇసుక దిబ్బలను తొలగిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లపై పేరుకుపోయిన మట్టి, ఇసుక దిబ్బలను తొలగిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం రాజేంద్రనగర్‌లోని రేడియల్ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ఒండ్రు మట్టి, ఇసుక దిబ్బలను తొలగించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పాటు జేసీబీల సాయంతో ఆయా పనులను నిర్వహించారు. రోడ్డుపై ఇసుక దిబ్బలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని గతంలో ప్రజావాణిలో సైతం వాహనదారులు ఫిర్యాదు చేశారు. వరదనీటికి ఒండ్రు మట్టితో పాటు ఇసుక కొట్టుకొచ్చి రోడ్లపై పేరుకుపోయింది. ప్రస్తుతం రోడ్లపై ఉన్న వీటిని తొలగించే పని పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజల ప్రాణాల సంరక్షణే లక్ష్యం

విద్యుత్ శాఖ సీజీఎం పాండ్యా నాయక్



అలకాపూర్ టౌన్‌షిప్‌లో కేబుల్ వైర్ల తొలగింపు పనులను పరిశీలించిన అధికారులు

మణికొండ: విద్యుత్ స్తంభాలకు కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను కుప్పలుగా కట్టటంతో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నాయని, వాటిని నివారించేందుకే తొలగిస్తున్నామని విద్యుత్‌శాఖ చీఫ్ జనరల్ మేనేజర్(ఆర్‌ఆర్‌జోన్) అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లో శనివారం విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను తొలగించే పనులను విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ స్తంభాలకు క్వింటాళ్ల కొద్దీ వైర్లను వేలాడ దీయటంతో స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం వారు వేరుగా స్తంభాలు ఏర్పాటు చేసుకోవటం, భూగర్భంలో కేబుల్‌ను ఏర్పాటు చేసుకుని వారి సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. అందుకు భిన్నంగా ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలను వాడుకుంటున్నారన్నారు. రాబోయే గణేశ్ నవరాత్రులు, విగ్రహ నిమజ్జనాల సమయంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ సీఎండీ ఆదేశాలతో హైదరాబాద్ వ్యాప్తంగా కేబుళ్ల తొలగింపు పనులను కొనసాగిస్తున్నామన్నారు. సైబర్‌సిటీ ఇంచార్జి ఎస్‌ఈ రాంబాబు, ఇబ్రహీంబాగ్ డీఈ రమేష్‌చంద్ర, ఏడీఈ అంబేద్కర్, ఏఈ సంతోష్‌కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, కార్యవర్గ సభ్యులు డాక్టర్ అవినాష్, బాబురావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: ఎస్‌ఓటీ సైబరాబాద్ అండ్ మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అలీనగర్‌లోని కొత్త నిర్మాణ భవనంపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 19,500 నగదు, రెండు కార్లు ఎక్స్‌యూవీ 200, స్కోడా, రెండు మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఎం.డి.ఫరీద్(45), రాజేంద్రనగర్‌కు చెందిన ఎం.డి.ఖుర్రామ్(43), అత్తాపూర్‌కు చెందిన సయ్యద్ ఇయూబ్(42), బండ్లగూడకు చెందిన ఎ.శివ(29), మరో ఇద్దరు నిందితులు ఎం.డి.రెహమాన్ అలియాస్ ఇద్రిస్, మహమ్మద్ ఉన్నారు. వీరి నుంచి నాలుగు స్మార్ట్ ఫోన్లు, రెండు యాక్టివా బైక్‌లు, స్కోడా, ఎక్స్‌యూవీ కారు, ఏడు ప్లేయింగ్ కార్డ్స్ సెట్స్, నగదును స్వాధీనం చేసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మామిడి కిశోర్ ప్రకారం... శివరాంపల్లి పిల్లర్ నంబర్ 3వ వద్ద ఓ యువకుడు పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. యువకుడి వయస్సు 30–35 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు స్థానికంగా భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బంది లేదా రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలన్నారు.

కేపీఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మణికొండ: కేపీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్‌ను కాలనీవాసులు కోరారు. శనివారం ఆయనను కలిసి ఈ మేరకు సమస్యల వివరాలతో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ కార్యదర్శి జి.సింహారాజరెడ్డి మాట్లాడుతూ... కాలనీ పార్కులో కొన్ని వీధి దీపాలు రావటం లేదని, రోడ్ల పక్కన చెత్త పేరుకుపోయిందని, కొన్ని చోట్ల ప్రజలు కూర్చునేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కాలనీలో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయని వాటిని తొలగించాలని కోరామన్నారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు సమస్యలను తెలపటంతో త్వరలోనే పరిష్కరిస్తారని తెలిపారన్నారు.

డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయొద్దు



క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు డ్రైనేజీల్లో చెత్త, వ్యర్థాలను వేయవద్దని వీటి కారణంగానే డ్రైనేజీలు నిండి మురుగు నీరంతా రోడ్లపై పారుతూ దుర్గంధభరితంగా మారుతుందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని పావని హార్మోని విల్లాస్‌లో తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ టి.శంకరయ్య, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం



అన్నదానంలో పాల్గొన్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: అవసరమైన ప్రజలకు తమ వంతు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో పేదలకు శనివారం అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి అమావాస్య రోజు ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నామన్నారు. పదుల సంఖ్య నుంచి మొదలైన అన్నదానం ప్రస్తుతం వందల మంది సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రాబోయే రోజుల్లోనూ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి: శ్రావణమాస చివరి రోజు సందర్భంగా శనివారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబుల్‌రెడ్డి నగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసంలో రోజూ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరి రోజులైన శనివారం ఉదయం 9 గంటల నుంచి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. వీరాంజనేయ స్వామి భక్త భజన మండలి సభ్యుల భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోచమ్మ దేవాలయంలో ప్రతి అమావాస్యకు నిర్వహించే అన్నప్రసాదాన్ని ఈ మౌళి అమావాస్య సందర్భంగా నిర్వహించారు. పోచమ్మ దేవాలయంలో 22వసారి పెద్ద ఎత్తున దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, ఉమ్మడి దేవాలయ కమిటీ నూతన అధ్యక్షుడు సెంట్రింగ్ శంకర్, కింగిరి శంకర్, సోమ శ్రీనివాస్‌గుప్తా, మల్లు పోతురాజు, మల్లేష్, లక్ష్మణ్, కిష్టప్ప, బి.వెంకటేష్, వెంకటరమణగుప్తా, జగన్, సురేష్, రామకృష్ణ, రమేష్‌రెడ్డి, సాయిలు, ఆనంద్, కుమార్, బాయికాడి అంజి, మొగలిలి శివ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు గణనాథులు



అలకాపూర్ టౌన్‌షిప్ రాంరెడ్డి మాల్ సర్కిల్ వినాయకుడికి ఆగమన పూజలు చేస్తున్న దృశ్యం

మణికొండ: వినాయక చవితి పర్వదినాన్ని నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. పలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, రోడ్లపైన ఏర్పాటు చేసే గణనాథుల విగ్రహాలు మండపాలను చేరుతున్నాయి. దాంతో వాటికి ప్రజలు హారతులు, భజనలు, ప్రత్యేక పూజలతో స్వాగతం పలుకుతున్నారు. బ్యాండ్ మేళాలతో ఆనందోత్సాలతో వినాయకుల విగ్రహాలను తమ కాలనీలకు ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే మండపాల ఏర్పాటు పనులు కొన్ని చోట్ల పూర్తి కావస్తుండటం, పలు చోట్ల చేపడుతుండగా తమకు నచ్చిన వినాయక విగ్రహాలను మండపాలకు తెచ్చి పెడుతున్నారు. పలు కాలనీల్లో వినాయక ఆగమనాలకు ప్రజలు మూకుమ్మడిగా స్వాగతం పలుకుతున్నారు.

సీపీఎస్ రద్దుకు మరో పోరాటం తథ్యం

- కదం తొక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయలు
- వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ర్యాలీ



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఏజీవర్సిటీ: కొత్త పింఛన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, శాస్త్రవేత్తలు డిమాండ్ చేశారు. పాత పింఛన్ పద్ధతి తీసుకురావాలని శనివారం బ్లాక్ డేగా నిర్వహించి భారీ ర్యాలీ చేపట్టారు. విశ్వవిద్యాలయంలో ఉద్యోగ జేఏసీ, వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సంఘాలు, సీపీఎస్ రద్దు పోరాటం సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వం రద్దు చేసిన పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని లేకుంటే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలానే ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులు 35 సంవత్సరాలు సర్వీస్ చేసి వయస్సు అయిపోయిన తరువాత మిగిలేది పింఛన్ మాత్రమే అని ఇప్పుడు అది కూడా లేకుంటే ఏవిధంగా బతకాలని ప్రభుత్వాని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలు సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని... ఇప్పుడు ఆ విషయంపై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి నుంచే పోరాటం ప్రారంభించాలమని రాత్రి పగలు ఇదే రోడ్లపై పడుకుని పోరాటం చేశామని మరో సారి ఈ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వెంటనే పాత పింఛన్ పద్ధతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పాత పింఛన్ విధానాన్నే పునరుద్ధరించాలి



రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీపీయూఎస్ నేతలు

రాజేంద్రనగర్: సీపీఎస్ (కొత్త పింఛన్) విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్నే పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) మండల అధ్యక్షుడు ఎం.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి జి.బాలకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం టీపీయూఎస్ ప్రతినిధులు బృందం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ద్వారా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.